పించుకొన్నాడు వూళ్ళో! పిల్లలందరికీ పెళ్ళిళ్ళు చేసివేశాడు. నిక్షేపంలా ఆరెకరాల మాగాణీ రెండెకరాల కొబ్బరితోటా సంపాదించాడు. ఆయన పెద్దకొడుకే ప్రస్తుతం అర్చకుడు.

ఆనాటి వూరుకాదు యిప్పుడు "ఐనాపురం" అంటే! అప్పటికీ యిప్పటికీ సంబంధమే లేదు. అసలు ఊళ్ళో ఎక్కడా పూరిల్లు కనిపించదిప్పుడు! జనాభాకూడా విపరీతంగా పెరిగిపోయింది. ఊరు పెరిగినట్టే ఊళ్ళో హైస్కూలూ, కాలేజీ, అన్నీ ఉన్నాయి. సర్వనాశనమైపోబోతూన్న గ్రామాన్ని ఆ స్వామి అవతరించి యింత వృద్ధిలోకి తెచ్చాడు అని, పెద్దవాళ్ళు ఎప్పుడైనా అనుకొంటూంటే, ఎగతాళిచేస్తారు యీనాటి కుర్రకారంతా.

రంగయ్యశ్రేష్ఠీ అప్పలనాయుడూ, తరచుగా కలిసికోరు. ఎప్పుడన్నా అనుకోకుండాతటస్థ పడితే భయం భయంగా నవ్వుకొంటుంటారు.

---

# "పెరటి చెట్టు"

"గోపి"

"ఊరంతా ఒకటి మనింట్లో మరొకటి కుర్రాణ్ణి కాస్త తూకలెయ్యమనడానికి కూడా క్రమము, పద్ధతి కావాలంటే ఎల్లా చస్తానండీ! వాడు బొత్తిగా బడిదేరిపోతున్నాడు, వెధవాయ్. వేటగాడి మెత్తనచూచి లేడిమూడు కాళ్లమీదే పరిగెత్తిందిట. అలావుంది మనసంగతి." అని. తన మామూలు తాపీతో కోర్టుకి తయారౌతూన్న న్యాయమూర్తి, సత్యనారాయణతో ఫిర్యాదు చేసింది యశోద.

"ఇన్ని వింటాంకానీ, ఇలాంటి కేసెక్కడా వినం. ఎవరో తెలీదు. అపచారం ఏమిటో అంతకన్నా తెలీదు..." అని నొక్కి నొక్కి, మాటల్ని రూపాయిల్లా ఖుర్చు పెడుతూన్నట్లన్నాడు.

"చంటివాడు ఎడవాడు; ఇంట్లో ఉండేదే ఇద్దరు వెధవలు నా ప్రాణానికి, ఎడవెధనిచూచి ఇప్పుడిప్పుడు అల్లరమొలకలు మొదలెడుతున్నాడా చంటివాడుకాని, వాడంతట వాడల్లర చెయ్యడానికి హాలులేదు"

"హాలుకాదు "హాలత్" హిందీ పదంలే అది"

"నా బొంద "జమంకిడిచి లొట్టలు. ఇంకెవరు చేస్తారో చెప్పండీ!"

"ఏమిటి చెయ్యడం?"

"నా క్రా...(నా నోరు తిన్నగా రాదు)ఇప్పుడు చెప్పిందంతా ఏమిటి?"

"నేనూ అదే అడుగుతున్నా ఏమిటి అని"

"అక్కర్లేని పనీలేదు, కావల్సిన పనీలేదు. ఈసుపోని మంగలి పిల్లితల గొరిగాడన్నట్లు, ఆవుని విప్పి, మందువాలోకి తోలాడు."

"ఎవరు?"

"ఎవరు"-ఎడవెధవ"

"తోత్రే?"

"తోత్రే-మడిబట్టలన్నీ మట్టిలోకీడ్చి, కడగడానికి పెట్టిన కప్పులు ప్లేట్లు కాళ్ళాచేతా కుమ్మి నాశనం చేసింది కలికంలోకి లేకుండా. తడిబట్టంతో వండనని, ఈ నెలతో మానేస్తానని, వెంకమ్మ నోటీసిచ్చింది..."

"అంటే ఆవుకి చేతులుకూడా ఉన్నాయన్న మాట!"

"ఆఁ! ఉన్నాయి..."

"అంటే ఆవు బట్టల్ని బురదలోకీడ్చి, కప్పులు ప్లేట్లు బద్దలుకొట్టింది. అంతేనా నువ్వనేది."

"ఆవుబద్దలు కొట్టిందీ అనేనా మీతీర్పు ఇంతకీ!"

"తీర్పువరకూ ఇంకారాందే, "అదేనా నీ వాదన" అని అడుగుతున్నానింకా!"

"ఒక మాటడుగుతాను కోప్పడకుండా చెప్పండీ, మీరే ఇలాగా? లేక అందరు న్యాయమూర్తులూ ఇంతేనా? ఎవరిచ్చారండీ మీకా జడ్జీపని? ఆ వెధన నా కందడుగాని, ఒక్క నిముసంలో వాడి భాగరణచేదాన్ని."

"ఐతే ఆ మాత్రం దానికి నాతో ఫిర్యాదెందుకూ?"

"మీతో కాక ఎవఁతో చెప్పుకోమన్నారండీ! నా మొహం కాకపోతేను"

"చెప్పిందేదో సరిగ్గా చెప్పవు, కోర్టుకి పైపైంది కూడాను."

"చెప్పిందంతా విని 'వాలిని చంపినది వాల్మీకియా వ్యాసుడా?' అంటే నే నెలాచస్తానండీ?"

"ఈ మాత్రం దానికే మరణదండన దేనికిలే; అంటే నువ్వింక చెప్పుకోదల్చిందేం లేవన్నమాట"

"లేకేమండీ! ఆ యెడ వెధవని పిలిచి నాలుగు కేకలు వెయ్యండీ"

"ఎందుకూ"

"రెడ్డొచ్చాడు మళ్ళా మొదలు పెట్టమన్నారుట. అలావుంది మీతో"

"ఇంతకీ నువ్వు చెప్పినదాన్నిబట్టి తేలిన విషయం ఏఁవిటో తెలుసా?"

"ఆవు నేరం చేసినట్లు ముందే చెప్పావుగా ఆ పరపరమానందయ్యగారు బయలుదేరారని వెధవ ఆవుని విప్పకపోతే ఆవు తనంతటతాను కప్పులు ప్లేట్లు బద్దలు కొడుతుందండీ?"

"ఇదే వచ్చినతంటా అంతా! ఒకక్రమం లేకపోతే అసలు అర్థం కాదు, నీ వ్యాఖ్య వెనక్కుంచి జరిగినవిషయం నీకు సంబంధించినంత మట్టుకు నువ్వు చెప్పు..."

"అంటే ఆవుకి సంబంధించిన విషయం ఆవు, బాబుకి సంబంధించిన విషయం బాబు చెప్పాలనేనా? ఇదేదో పులీ-బ్రాహ్మడూ కథలాగుంది."

"మరి నా కర్థమయ్యేదెట్లా?"

"ఐతే వినండి శ్రద్ధగా, స్థలం న్యాయమూర్తిగారి ఇల్లు"

"న్యాయమూర్తి?"

"ఆఁ! న్యాయమూర్తి, సత్యనారాయణ బహద్దూరుగారి ఇల్లు. విప్పబడినది ఆవు-విప్పినది బాబు. బద్దలు కొట్టబడినవి కప్పులు, ప్లేట్లు, మట్టిలో దొర్లింపబడినవి మడిపంచెలు. ఇదంతా చేసినది "ఆవు." ఇందుకు కారణం బాబు. ఫిర్యాదీ యశోద ... అర్థమైందా?... బాబుని నాలుగు కూరతేసి గూబకదలేస్తే కప్పులకీ సాసర్లకీ అకాలమృత్యువు. మడిబట్టల కవమానం. మనకి స్వయంపాకక్రియ, తప్పుతాయి. వెంకమ్మని కాస్త బ్రతిమాలుకుంటే రాజీనామాని ఉపసంహరించుకుంటుంది. ముందుముందు ఇలాంటి అగచాట్లు తప్పుతాయి...ఇప్పుడన్నా అర్థమైందా స్వామీ?"

"చాలామట్టుకు.. కానీ ఒక్కవిషయంమాత్రం తేలలేదు, బాబు ఆవు చేత కప్పులు ప్లేట్లు ఎందుకు బద్దలుకొట్టించాడు అన్నది."

"వాడు పగలగొట్టించడవేఁవిటండీ నా బొంద"

"అంటే ఆవుకే పగలగొట్టాలన్న బుద్ధిపుట్టిందంటావా?"

"ఇది మరీ బాగుంది, బందెపోటు దొంగతనాలు, హత్యలు అర్థమౌతాయిగాని ఇంట్లో గొడవలు అర్థం కావు కామోసు!"

"ఐతే కారణం ఏఁవిటుంటావ్?"

బాబు ఆవుని విప్పి మండువాలోకి తోలేడు. మండువాలో కప్పులు ప్లేట్లు కడగడానికి పెట్టారు; సిమెంటునేల, ఆవు కంగారులో గిట్టలు జారి, అటూ ఇటూ నృత్యం చేసింది. అది కప్పుల పాలిటి ప్రళయకాల నృత్యంగా పరిగణించింది."

"అంటే కేవలం ప్రమాదంకల్ల కాకతాళీయంగా బద్దలయ్యాయంటావు...అంతేనా?"

"మీ అడ్డువాదనతో నాతల వాచిపోతూంది"

"నీ జబాబులతో నాకు పిచ్చెక్కుతూంది."

"వాడావుని తోలకపోతే మండువాలోనికి ఆవు ఎందుకు వస్తుందండీ?"

"ఎందుకు తోలాడు?"

"ఆడే వెధవని పిలిచి రెండు వేడివేడిగా వడ్డించి కనుక్కోండి."

"ముందు వడ్డించి తరువాత కనుక్కోడం ఎంతతప్పో తెలుసా?"

"ఆఁ! తెలుసు, మీ రప్పుడప్పుడు కోర్టుల్లో వెలగబెట్టే వాదనల్లో ప్రశ్నలబట్టి అర్థమైంది. అవే 'థర్డు డిగ్రీ మెథడ్సు' అంటారు"

"తెలిసీ నేరంచేయడం ఎంతతప్పో తెలుసా?"

"ఆరునెల్లు సహవాసంచేస్తే వారు[illegible] ఆమాత్రం తెలీదూ న్యాయమూర్తిగారి ధర

పత్నినైయుండీ? ఇంతకీ వాణ్ణినాలుగు తూక తీస్తారా? లేదా?"

"మరి వాడేడీ?"

"క్రిందటికి ఒకామె అందిట 'అయనంటే ఎవర్నో పిలుచునుకదా అని' మీలాంటిదే!"

"అంటే నన్ను వెళ్ళి పట్టుకురమ్మన్నావా? ఇప్పుడు?"

"లేకుంటే నన్ను వాడివెనకాల పరిగెత్తమంటారా? వాణ్ణి పట్టుకోలేకే మీతో ఫిర్యాదు. నాచేతికందితే మీదాకానా? పులుసు కాస్తా వదలగొట్టేదాన్ని..."

వాగ్వివాదాలుసాంతం అయ్యాయో లేవో కాని రోడ్డుమీద సేతుకయ్యంలో పరాజితుడైన బాబు క్రొత్తబట్టల కంటుకున్న బుగ్గిదులుపుకుంటూ (ఇంట్లో చేసిన అల్లరి పరగడుపుకిరాగా) దొంగలా మెల్లమెల్లగా లోపలికి దారితీశాడు. చూచి చూడనట్లు ద్వారందగ్గర పక్కగా నక్కి యశోద బాబుచేయిపట్టుకుని గొరగొరా ఈడ్చుకొచ్చింది సత్యనారాయణ ముందుకు.

"అడగండి వెధవేంచేశాడో, వాడి బట్టలూ వాలకం చూడండి. పొద్దున తొడిగినబట్టలు..."

"ఏంచేశావురా బాబూ?"

"ఏంలేదు నాన్నా."

"ఏంలేదూ?"అని చిన్న తొడపాయసం చదివించింది యశోద.

ముఖం జేవురించి, మందాకినీ ప్రవాహం ప్రారంభించింది. వెక్కుతూ రాగాలాపనోపక్రముడైన బాబుమీదికి విసిరింది ప్రశ్నలు.

"నిన్నెవరిప్పమన్నార్రా? నువ్వేం పశువుల కాపువాడివిరా? నీకేం జీతంభత్యం ఇస్తున్నాంరా విప్పడానికి?..."

"చూడు నాన్నా, పశువుల కాపువాణ్ణి అంటోంది" ఏడవడానికి ప్రారంభించగా-

"పశువుని ఇప్పినవాడివి అని అర్థంలే. నువ్వు విప్పావుకాబట్టి అలా అంది. దాంట్లో తప్పేముంది?"

"నే నావుని విప్పాను. పశువునెవరు విప్పారు?"

"వెధవా, యీ ఆవుకూడా నీలాగ ఒక పశువే! చూచావా! వాడిచేతే చెప్పించాను ఇప్పినట్లు. (ప్రగల్భంగా) ఎందుకిప్పావురా?"

"మేతకి."

"నిన్నెవ్వరిప్పమన్నార్రా?"

"ఆవు"

సత్యనారాయణ కేసు నడుస్తూన్నట్లు వింటూన్నా, యశోద నవ్వాపుకోలేకపోతూంది.

"ఎలా చెప్పిందిరా?"

"గడ్డిపక్కచూచి తలూపింది."

"అచ్ఛా, మందువాలోకెందుకు తోలేవురా?"

"కేసు ఇప్పుడు సరిగ్గా నడుస్తూంది."

"ఎగ్గు తెమ్మన్నారా?"

"నీ క్రాస్ ఎగ్జామినేషన్ కానివ్వ, నేను ఆఫీసుకు పోవాలి తొందరగా."

"దానంతటదే వచ్చింది మందువాలోకి."

"అంటే గడ్డికోసం బుర్రూపలేదన్న మాట!" అంటూ తొడపాయసం కీ కొంచెం ఎక్కించింది.

"నేనే తోలా"నంటూ కీచుగొంతుకతో అరిచాడు బాబు.

కోపంతో ముఖం ఎర్రబారి ఆపుకోలేకపోయాడు.

"నాన్నా! పీచుమిఠాయికి డబ్బడుగుతే చెయ్యి తిరుబాటులేదంది నాన్నా!" అని వెక్కివెక్కి ఏడుస్తూ వెళ్ళగక్కేడు అసలు కడుపులోని బాధ.

"చాల్లే ఇంక వాణ్ణి వదిలేయ్"అనడంతోనే బాబు తుర్రున పారిపోయాడు.

"ఓ అణా పీచుమిఠాయికి పారేస్తే బోలెడన్ని కప్పులు సాసర్లు మిగిలేవి...మడిబట్టల కవమానం తప్పేది."

"అంటే మీ ఉద్దేశంలో నాదేనా తప్పు?"

"అసలు తప్పులు అటుండగా నువ్వు నిజం చెప్పించడానికి ఉపయోగించిన పోలీసు జులుం, కోర్టుని అవమానించినందుకు, 'కన్టెమ్ట్ ఆఫ్ కోర్టు' ఇట్లాంటి ఛార్జీలు చాలా పెట్టాలి. దానికితోడు నువ్వు త్వరగా భోజనం పెట్టకపోతే, ఉత్త కడుపుతో కోర్టుకి పంపించిన పాపంకూడా చుట్టుకుంటుంది" అని చక్కని తీర్పుచెప్పిన వానిలా, యశోద చేయిపుచ్చుకు భోజనానికి దారితీశాడు సత్యనారాయణ.

★